# కథ ఉదయరాగాలు

అంపశయ్య నవీన్

**"అమ్మా!" అని ఇల్లంతా దద్దరిల్లి పోయేలా అరిచింది ఎనిమిదేళ్ళ పాప, కావేరి.**

**"యేమైందమ్మా!" అంటూ పరిగెత్తు కొని వచ్చింది కావేరి వాళ్ళమ్మ అరుణ.**

**"అన్నయ్య గిచ్చాడు" అంది కావేరి ఎఱ్ఱగా కమిలిపోయిన చెంపను చూపి స్తూ బిగ్గరగా యేడుపు లంకించుకుంది.**

**"ఎందుకు దాన్ని గిచ్చావు?" అంది అరుణ పదేళ్ళ కొడుకు కార్తీక్ కేసి కోపంగా చూస్తూ.**

"అది నా క్రికెట్ బ్యాట్ తీసుకుంది" అన్నాడు కార్తీక్.

"కాస్సేపు నీ బ్యాట్ తీసుకున్నంత మాత్రాన దాని చెంపలు కందిపోయే లా గిచ్చుతావా?" అంది కార్తీక్ నెత్తి మీద ఓ మొట్టికాయ వేస్తూ అరుణ.

"కాస్సేపు కాదమ్మా... చాలా సేపట్నించి నా బ్యాట్‌తో అది పిచ్చి పిచ్చి ఆటలన్నీ ఆడుతోంది. ఇంతకు ముందు మా రూంలోకి ఓ ఎలుకొస్తే దాన్ని ఈ బ్యాట్‌తో కొట్టబోయింది. కొంచెమైతే నా బ్యాట్ రెండు ముక్క లుగా విరిగిపోయేదే... ఇంకో బ్యాట్ కొనిమ్మంటే మీరు కొనిస్తారా?..." అన్నాడు కార్తీక్.

"వాడి బ్యాట్ జోలికి పోవద్దే అని నీకెన్నిసార్లు చెప్పానే... అయినా నీకు బుద్ధిలేదు" అంది అరుణ.

"నాకూ ఓ బ్యాట్ కొనిమ్మంటే ఎందుకు కొనివ్వరు? అన్నీ ఆయనకే కొనిస్తారు. నాకేం కొనియ్యరు" అంది కావేరి ఇంకా యేడుస్తూనే.

"క్రికెట్ బ్యాట్ నీకెందుకే... క్రికెట్ మగపిల్లలు ఆడుకునే ఆట... వాడికుంది. నాకెందుకుండదు అన్న కక్షతో నువ్వు వాడితో గిచ్చి కయ్యం పెట్టుకుంటున్నావు" అంది అరుణ.

"క్రికెట్ మగపిల్లలు మాత్రమే ఆడుకునే ఆట అని ఎవరన్నారు?... ఆడపిల్లలు కూడా క్రికెట్ ఆడుతు న్నారు. మా స్కూల్లో ఆడపిల్లలు కూడా క్రికెట్ ఆడారు. వాడు మగపిల్లాడు కాబట్టి నీకు వాడిమీదే ప్రేమ" అంది కావేరి.

"నీ మొహంలే... ఇద్దరికీ క్షణం పడటం లేదు. ఎప్పుడూ గొడవలే... మీతో వేగలేక చచ్చిపోతున్నాను... వాడు మొగపిల్లాడని నాకు నీ మీదకంటే వాడిమీదే ప్రేమా!? ఈ మాట మరోసారన్నావంటే..." ఆవేశంతో వణికిపోతూ అంది అరుణ.

"యేమైంది?... ఎందుకంత ఆవేశపడిపో తున్నావు? ఈ గొడవ ఎప్పుడూ ఉండేదే కదా!" అంటూ ఆ గదిలోకి అశోక్ వచ్చాడు.

"నాన్నా... నాన్నా... అన్నయ్య నన్నెలా గిచ్చాడో చూడు" అంటూ కావేరి వాళ్ళ నాన్న దగ్గరకు వెళ్ళి కందిపోయిన తన చెంపను చూపించింది.


"యేమిట్రా ఇది...?" అన్నాడు అశోక్.

"అది నా బ్యాట్‌తో ఎలుకను చంపడానికి ప్రయత్నించింది... కొంచమైతే అది రెండు ముక్కలైపోయేది అన్నాడు కార్తీక్.

"ఒకరి వస్తువులు ఒకరు ముట్టుకోవద్దని మీకెన్నిసార్లు చెప్పాను... వాడికి వాడి బ్యాటంటే ప్రాణం. వాడి బ్యాట్ జోలికి వెళ్ళొద్దని నీకెన్నిసార్లు చెప్పాను..." అన్నాడు అశోక్.

"దానిక్కూడా ఓ బ్యాట్ కొనివ్వండని నేను మీకెన్నిసార్లు చెప్పాను. దానికి బ్యాటెందుకని తీసిపారేశారు. మీరసలు ఇంట్లో దేన్నీ పట్టించుకోరు. ఎప్పుడూ మీకు బయటి ప్రపంచంతోటే పని... ఆఫీసు... ఫ్రెండ్స్... పార్టీలు... వీళ్ళతో వేగలేక నేనెన్ని బాధలు పడ్తున్నానో మీకవ సరం లేదు... వీళ్ళు నేను చెబితే వినరు... మీరు చెబితేనే వింటారు... వీళ్ళను కాస్త కంట్రోల్ చెయ్యండి బాబూ! అని ఎంత మొత్తుకున్నా మీరా పనిచెయ్యరు..." అంటూనే అరుణ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఆఫీసుకెళ్ళకుండా ఇంట్లోనే కూర్చో మంటావా? ఫ్రెండ్స్‌తో ఎప్పుడు తిరిగాను? యే పార్టీలకు వెళ్ళాను... చాలా అన్యా యంగా మాట్లాడ్తున్నావు. నీలాగ రోజులకు రోజులు పెళ్ళిళ్ళకూ, పేరంటాలకు వెళ్ళానా? అమ్మలక్కల్ని కూర్చోబెట్టుకుని గంటలగ్గంట



లు చీరల వాడితో బేరమాడానా?" అన్నాడు అశోక్.

"నేను పెళ్ళిళ్ళకు పేరంటాలకు వెళ్ళానా? చీరలవాడితో గంటలగ్గంటలు బేరమాడానా? ఎంత దారుణంగా మాట్లాడుతున్నారండీ! 24 గంటలు బండెడు చాకిరీ చేస్తూ ఈ నాలుగ్గోడల మధ్యే చస్తున్నాను కదా!

రోజూ వీళ్ళను తయారుచేసి స్కూలుకు పంపించడానికి ఎంత యాతన పడ్తున్నానో చూడటం లేదా మీరు... స్కూలు నుండి రాగానే స్నానాలు చేయించి హోంవర్క్ చేయించడానికెంత నెత్తీ నోరు బాదుకుంటు న్నానో మీకు తెలియదా? మీకెందుకు తెలుస్తుంది లెండి... ఆఫీసు నుండి ఇంటికొచ్చేటప్పటికే మీకు యే అర్ధరాత్రో అవుతుంది కదా!" అంది అరుణ.

"ఎందుకలా అరుస్తున్నావు... నీకేమన్న బుద్ధుందా? ఎప్పుడో ఒకసారి ఆఫీసులో పనుండో, యే ఫ్రెండ్‌తోనో గడిపో కాస్త లేట్‌గా వచ్చినంత మాత్రాన రోజూ అర్ధరాత్రి దాటాక వస్తున్నావని అభాండం వేస్తావా? దిసీజ్ టూమచ్!"

"అవును... అన్నీ మీకు టూమచ్‌గానే కనిపిస్తాయి. స్కూలుకు టైమయింది... వీళ్ళింకా తయారే కాలేదు. ఆటోవాడొచ్చే టైమయింది. వాడు క్షణంసేపు కూడా ఆగడు. దయచేసి ఈ ఒక్కరోజు వీళ్ళను మీ స్కూటర్ మీద తీసికెళ్ళి స్కూళ్ళో దింపేసి వస్తారా?" అంది అరుణ.

"లేదు. అస్సలు వీలు కాదు. ఈ రోజు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉంది. నా ఫైళ్లన్ని ఆర్డర్‌లో పెట్టుకోవాలి. ఇంకో పది నిమిషాల్లో నేను ఆఫీసులో ఉండకపోతే నా ఉద్యోగం ఊడుతుంది" అంటూనే అశోక్ అక్కడ్నించి స్నానం చెయ్యడానికి బాత్‌రూం వైపు నడిచాడు.

"ఎవ్వరూ సహాయం చెయ్యకండి. నా చావు నేనే చస్తాను..." అంటూ అరుణ కావేరి దగ్గరకు వెళ్లింది. "ఇంతవరకు జడ వేసుకోలేదు... యూనిఫామ్ వేసుకోలేదు... వాడి బ్యాట్‌తో ఆడుతూ కూర్చున్నావు. నీకీ జన్మలో బుద్ధిరాదే..." అంటూ అరుణ కోపంగా కావేరి జడపట్టి లాగింది.

"అమ్మో..." అంటూ కావేరి కెవ్వుమని అరచింది.

"యేమైంది? ఎందుకలా అరిచావు" అంది అరుణ.

"నా జడపట్టి లాగావు... నొప్పి... నొప్పి" అంటూ కావేరి మళ్ళీ పెద్దగా యేడ్వటం మొదలెట్టింది.

ఆ యేడుపును పట్టించుకోకుండానే "ఒరేయ్ కార్తీక్! నువ్వింకా యూనిఫామ్ వేసుకోకుండా యేం సర్దుతున్నావురా?" అంది అరుణ.

"నా కంపాస్ బాక్స్ కనిపించడం లేదమ్మా... ఈ దెయ్యమే తీసి ఎక్కడో దాచేసింది... యేమే దయ్యం! నా కంపాక్స్ బాక్స్ ఎక్కడ దాచావో చెప్పు" అంటూ కావేరి దగ్గరకొచ్చాడు కార్తీక్.

"నన్ను దెయ్యం అంటావా... నువ్వే దయ్యానివి... నువ్వే రాక్షసుడివి... నీ కంపాక్స్‌ని యే చెత్తబుట్టలో వేసుకున్నావో చూసుకోపో..." అంది కావేరి యేడుస్తూనే.

"యేడుపుగొట్టు మొహం... ఎప్పుడూ యేడుపే... నా కంపాక్స్ ఎక్కడ దాచావో చెబుతావా? వీపు మీద రెండు అంటించనా?" అన్నాడు కార్తీక్.

"ఒరేయ్ కార్తీక్... నీ కంపాక్స్ ఇక్కడే ఎక్కడో ఉంటుంది... వెతుక్కోరా. దాన్ని యేమనకు" అంది అరుణ కావేరికి జడ వేస్తూ.

"అది దాని బ్యాగ్‌లోనే ఉంటుంది..." అంటూనే కార్తీక్ కావేరి పుస్తకాల బ్యాగ్‌లోని పుస్తకాలన్నింటినీ బయటకు తీయసాగాడు.

"నా బ్యాగ్ ముట్టుకుంటే చంపేస్తాను... చూడమ్మా! చక్కగా నేను సర్దుకున్న పుస్తకాలన్నింటినీ ఎలా చిందరవందరగా మార్చేశాడో... నీ బ్యాగ్‌ను కూడా నేను..." అంటూ కావేరి కార్తీక్ బ్యాగ్ దగ్గరకెళ్ళబోయింది.

"ఇదిగో చూశావా అమ్మా! నా కంపాక్స్ బాక్స్ దీని బ్యాగ్‌లోనే ఉంది" అంటూనే కార్తీక్ తన బ్యాగును కావేరి చేతుల్లోంచి లాగేసుకొని షూజ్ వేసుకోవడానికి వెళ్ళాడు.

"వాని వస్తువులు ముట్టుకోవద్దని నీకెన్ని సార్లు చెప్పినా నీకు బుద్ధిరాదే..." అంది అరుణ జడ వేయడం ముగించి.

"నాకు కొంచెం టిఫిన్ పెడ్తావా? వెళ్ళిపొమ్మంటావా? లంచ్‌బాక్స్ రెడీ చేశావా? లేదా?" డ్రెస్సింగ్ టేబుల్ ముందు తల దువ్వుకుంటూ నిల్చొని అశోక్ అరవసాగాడు.

"డైనింగ్ టేబుల్ మీదున్న కేసరోల్‌లో ఉప్మా ఉంది. పెట్టుకొని తినండి. ఈలోగా లంచ్‌బాక్స్ రెడీ చేస్తాను" అంది అరుణ.

**"అవును... అన్నీ మీకు టూమచ్‌గానే కనిపిస్తాయి. స్కూలుకు టైమయింది... వీళ్ళింకా తయారే కాలేదు. ఆటోవాడొచ్చే టైమయింది. వాడు క్షణంసేపు కూడా ఆగడు. దయచేసి ఈ ఒక్కరోజు వీళ్ళను మీ స్కూటర్ మీద తీసికెళ్ళి స్కూళ్ళో దింపేసి వస్తారా?" అంది అరుణ.**

హారన్ మోగించుకుంటూ ఐదారుగురు స్కూలు పిల్లల్ని ఎక్కించుకొని ఆటోవాలా వచ్చేశాడు.

"వీళ్లింకా యేమీ తిన్లేదు... ఓ ఐదు నిమిషాలు ఆగుతావా రామయ్యా?" అంది అరుణ.

"ఇప్పటికే లేటయ్యిందమ్మా... ఇంకో ముగ్గురిళ్ళకు వెళ్ళాలి. ఉండమంటారా... వెళ్ళిపొమ్మంటారా?" అన్నాడు ఆటోవాలా రామయ్య.

"వట్టి కడుపుతో ఎలా పంపించను... వెళ్ళిపో రామయ్యా! అంది అరుణ. ఆటోవాలా వెళ్ళిపోయాడు.

"ఆటోను పంపించేశావ్... వీళ్ళను స్కూళ్ళో ఎలా దిగబెడ్తావు?" అన్నాడు అశోక్.

"నా చావు నేను చస్తాను... మీకెందుకు?" అంది అరుణ.

"నీకసలు బుద్ధిలేదు... ఆటో వచ్చే టైముకు పిల్లల్ని రెడీగా ఎలా ఉంచాలో నీకు తెలీదు... యేడింటిదాకా పడుకోకపోతే కాస్త ముందే లేపొచ్చుగా..." అన్నాడు అశోక్.

"నేను యేడింటిదాకా పడుకున్నానా? ఎప్పుడు చూశారు? అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నారు... మీకసలు జాలి, దయా అనేవేమన్నా ఉన్నాయా?" అంది అరుణ.



"నేను అర్థం పర్థం లేకుండా మాట్లాడానా? నాకు జాలి, దయా లేవా? యేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? గర్వంతో నీ కళ్ళు నెత్తికెక్కాయి" అన్నాడు అశోక్.

"ఎందుకండీ గర్వం? అనుక్షణం పోట్లాడుకుంటూ నరకాన్ని చూపిస్తున్న ఈ పిల్లల్ని చూశా? ఇక్కడున్న చెంబు తీసి అక్కడ పెట్టని నా భర్తగార్ని చూసుకొనా?"

"నీకసలు పిల్లల్ని ఎలా మేనేజ్ చేసుకోవాలో తెలీదు... భర్తనెలా చూసుకోవాలో తెలీదు... ఎప్పుడూ అందరి మీద రుసరుసలాడటం మాత్రం బాగా తెలుసు..."

"అవును... పేదవాడి కోపం పెదవికి చేటు అన్నట్టు రుసరుసలాడటం తప్ప నాకేం తెలుసు".

"అమ్మా... మేం టిఫిన్ చేశాం... మమ్మల్ని స్కూలుకెలా వెళ్ళమంటావు?" అన్నాడు కార్తీక్.

"మెయిన్ రోడ్డుదాకా వచ్చి ఆటో ఎక్కిస్తాను పదండి" అంటూ అరుణ పిల్లలతో బయటకు వెళ్ళింది. "కీస్ పక్కింటివాళ్ళకిచ్చి వెళ్ళండి" అంది భర్తనుద్దేశించి.

●